

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (ఆది)
సహరి : 4:43 (సోమ)



వైసీపీ ప్రచార వాహనంపై కప్పిన పరదా

కోడ్ అమలంటే మాటలు కాదు

అధికారుల ఉరుకులు.. పరుగులు

ముదినేపల్లి, మార్చి 23 : ఎన్నికల కోడ్ అమలు చేయడమంటే అధికారులకు ఆషామాషీ కాదు. అధికార యంత్రాగానికి కత్తి మీద సాములా మారింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టిన కొత్త పద్ధతులతో ప్రజలు, వివిధ రాజకీయ పక్షాల నుంచి ఫిర్యాదులు పెరిగాయి. ఎవరికి వారు తాము చేయాలనుకున్న ఫిర్యాదులను ఫొటోలతో సహా సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు వెళుతున్న ఈ ఫిర్యాదులు క్షణాల్లో మండలస్థాయి అధికారుల కు అందుతున్నాయి. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు, కార్యక ర్తల ఇళ్ల వద్ద సీఎం ఫొటోలతో ఫ్లెక్సీలు, వైసీపీ జెండాలు, ప్రచార వాహనాలు తదితర అంశాల పై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై చర్యలు తీసుకునేందుకు తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోపీ ఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఆయా గ్రామాలకు వెళ్లి వాటిని తొలగించడం, వాహనాలపై పరదాలు కప్పించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఎక్కడి నుంచి ఏ ఫిర్యాదు వస్తుందోనన్న అధికారులు టెన్షన్ టెన్షన్‌గా ఉన్నారు. మరోపక్క వలంటీర్లు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సి వస్తోంది.

రంగు పడింది..

ద్వారకా తిరుమల/కలిదిండి : ఎన్నికల కోడ్ అమలులోకి కొన్నిచోట్ల సక్రమంగా అమలు కావడం లేదు. ఈ కోవలోనే ద్వారకా తిరుమల సచివాలయంపై వైసీపీ రంగులను మార్చలేదు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. వైసీపీ రంగులను తొలగించి తెల్ల రంగు వేయిం చారు. కలిదిండి మండలం వెంకటాపురంలో రైతు భరోసా కేంద్రానికి వైసీపీ రంగులు ఉన్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేసినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. దీంతో తక్షణం చర్యలు తీసుకుని వైసీపీ రంగులు తొలగించి రైతు భరోసా కేంద్రం భవనా నికి గ్రీన్ కలర్ వేయించినట్టు ఆయన తెలిపారు.

సూపర్‌వైజర్‌పై వేటు

ఏలూరు రూరల్ : 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పం దించారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తెర్లి లక్ష్మీనారాయణ పోణంగికి చెందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే నాని సమక్షంలో వైసీపీలో చేర్పించాడు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించడంతో అతన్ని విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర బేవరిజెస్ కార్పొరేషన్ ఏలూరు డిపో మేనేజరు ఆదేశాలు జారీ చేశారు.

వలంటీర్ తొలగింపు

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ పైడి అరుణ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

ఏలూరు కలెక్టరేట్ : రాబోయే సార్వ త్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఏలూరు కొత్త బస్టాండులో శనివారం ఓటర్లకు నమూనా ఈవీఎంలపై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 1700కు పైగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.

గెలుపు కోసం.. బాబు దిశా నిర్దేశం





2024-సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మంగళగిరిలో శనివారం కూటమి అభ్యర్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడేందుకు ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. పొత్తుల్లో భాగంగా కొన్ని స్థానాలను అభ్యర్థులు త్యాగం చేయాల్సి వచ్చిందన్నారు. వారు పార్టీకి అందించిన సేవలను, కూటమి అధికారంలోకి రాగానే వారికి తగిన స్థానం ఇస్తుందని తెలిపారు. సమావేశంలో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి టీడీపీ అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, అంగర రామ్మోహన్, ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్, చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, సొంగా రోషన్, మద్దిపాటి వెంకట్రాజు తదితర నేతలు హాజరయ్యారు.

ఇక తేల్చుకుందాం



పోలవరం అభ్యర్థిగా చిర్రి బాలరాజుకు బీఫాం ఇస్తున్న పవన్, కరాటం తదితరులు

ఏలూరు ఎంపీ బరిలో మాజీ మంత్రి అల్లుడు వర్సెస్ మంత్రి తనయుడు

- ఇద్దరిది బీసీ సామాజిక వర్గమే.. సరికొత్త ప్రయోగం
- అసెంబ్లీ స్థానాల్లోనూ హేమాహేమీలు
- పోటీపరంగా భారీ మోహరింపులు
- చడీచప్పుడు లేని కాంగ్రెస్ కమ్యూనిస్టుల జాబితా

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ప్రధాన పక్షాలన్నీ వచ్చే ఎన్నికల్లో పోటీకి వీలుగా అభ్యర్థులను రంగంలోకి దింపాయి. సామాజిక వర్గాల వారీగా సుదీర్ఘ కసరత్తు చేసి మరి ఎంపికచేశాయి. ఏలూరు జిల్లాలో వైసీపీతోపాటు మిత్రపక్ష కూటమి కైకలూరు అసెంబ్లీ స్థానం మినహా మిగతా అరింటిలోనూ అభ్యర్థులను ఖరారు చేశాయి. లోక్‌సభ స్థానానికి వైసీపీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు సునీల్ కుమార్, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పోటీ పడుతున్నారు

మంత్రి కొడుకు.. మాజీ మంత్రి అల్లుడు

ఏలూరు లోక్‌సభ స్థానంలో తగినంత పట్టు, గెలుపు సాధించేందుకు ప్రధాన పక్షాలు బీసీ అస్త్రం ప్రయోగించి కీలక వ్యక్తులను రంగంలోకి దింపాయి. వాస్తవానికి ఈ నియోజకవర్గ రాజకీయాలను ఒక బలమైన సామాజికవర్గం శాసిస్తుండగా ఓటర్లు అటువైపుగా మొగ్గు చూపేవారు. ఈ సారి అభ్యర్థిని ఎంపిక చేయడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడింది. సామాజిక పరంగా, ఆర్థికంగా పట్టున్న నేత కోసం అన్వేషించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్ పేరు తెర ముందుకు తేవడమే కాకుండా దీనికి అనుగుణంగానే మంత్రిని ఒప్పించగలిగారు. తణుకులో కారుమూరికి చేదోడువాదోడుగా ఉండే ఆయన తనయుడిని లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేశారు. వాస్తవానికి సునీల్ ఈ నియోజకవర్గానికి కొత్త ముఖమే. ఒకప్పుడు దెందులూరు అసెంబ్లీ స్థానం నుంచి బీసీ ప్రయోగం చేసి కారుమూరిని అభ్యర్థిగా రంగంలోకి దింపినా ఆయనకు ఓటమి ఎదురైంది. ఇప్పుడు అటు నరసాపురం, ఇటు ఏలూరు లోక్‌సభ స్థానాలకు ఇద్దరు బీసీ అభ్యర్థులను ఎంపిక చేసి వైసీపీ రంగంలోకి దింపింది. ఈ నియోజక వర్గాల్లో తాజాగా బీసీలను అప్రమత్తం చేయడం ద్వారా వారి ఓటు బ్యాంకును రాబట్టి లాభపడాలని వైసీపీ ఎత్తుగడ వేసింది. టీడీపీ సైతం ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేసింది. రాజకీయాల్లో కొత్తరక్తం ఎక్కించే దిశగా టీడీపీ ఈ ప్రయోగం చేసింది. వాస్తవానికి ఎన్నికల ప్రకటనకు చాన్నాళ్ల ముందే ఏలూరు నుంచి బీసీ అభ్యర్థిని రంగంలోకి దించాలని టీడీపీ భావించింది. ఆర్థిక హంగు కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి అయితే గెలుపు ఖాయమని ముందుగానే వ్యూహం ఖరారు చేసి గోరుముచ్చు గోపాల్ యాదవ్ పేరును తెర ముందుకు తెచ్చారు. చివరకు యనమల అల్లుడు పుట్టా మహేష్ యాదవ్ పేరు బలంగా తెరముందు కొచ్చింది. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ మైదుకూరు నుంచి పోటీకి సిద్ధపడుతూ వచ్చారు. అదే నియోజకవర్గం నుంచి రెండోసారి ఈ ఎన్నికల్లోనూ తలపడుతున్నారు. యాదృచ్ఛికంగా వైసీపీకి చెందిన మంత్రి కారుమూరి తనయుడికి, టీడీపీకి చెందిన మాజీ మంత్రి యనమల అల్లుడికి మధ్య ఏలూరులో ప్రధాన సంగ్రామం జరగబోతోంది. మహేష్‌ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే టీడీపీలో సమైక్యగళం వినిపించింది. మహేష్ కార్యకర్తలు, నేతలతో భేటీ కానున్నారు. సోమవారం ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ముఖ్యులు, కార్యకర్తలతో భేటీ అవుతున్నారు.

పార్లమెంట్/అసెంబ్లీ	వైసీపీ అభ్యర్థి	టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి
ఏలూరు అసెంబ్లీ	ఆళ్ళ నాని	బడేటి చంటి
ఉంగుటూరు	పుప్పాల వాసుబాబు	పత్సమట్ల ధర్మరాజు
నూజివీడు	మేకా ప్రతాప్‌అప్పారావు	కొలుసు పార్థసారథి
పోలవరం	తెల్లం రాజ్యలక్ష్మి	చిర్రి బాలరాజు
కైకలూరు	దూలం నాగేశ్వరరావు	పెండింగ్ (బీజేపీ)
దెందులూరు	కొఠారు అబ్బయ్యచౌదరి	చింతమనేని ప్రభాకర్
ఏలూరు లోక్‌సభ	కారుమూరి సునీల్‌కుమార్	పుట్టా మహేష్‌కుమార్



మహేష్‌కుమార్



సునీల్ కుమార్

అసెంబ్లీ స్థానాల్లో ఇక నువ్వా..నేనా!

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఇక నువ్వా నేనా అన్నట్టు పోరు సాగబోతోంది. పొత్తులో భాగంగా కైకలూరు స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. బీజేపీ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించనే లేదు. కేంద్ర పార్టీ పెద్దలు అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘసమాలోచనలు జరుపుతూ వస్తున్నా కసరత్తు పూర్తి కాలేదు. ఉంగుటూరులో జనసేన, పోలవరంలో తాజాగా ప్రకటించిన జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు టీడీపీ కేడర్‌ను కూడకట్టుకుని ముందుకు వెళుతున్నారు. ఏలూరు, నూజివీడు, చింతలపూడి, దెందులూరు

జనసేన : పోలవరం టిక్కెట్ చిర్రి బాలరాజుకే

కొయ్యలగూడెం, మార్చి 23 : పోలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా ఎట్టకేలకు జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజుకు ప్రకటించారు. ఈ సీటు ఏ పార్టీకి, ఎవరికి కేటాయిస్తారని కొన్ని నెలలుగా సాగిన ఉత్కంఠకు తెరపడింది. టీడీపీ నుంచి పోటీ చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొరగం శ్రీనివాస్ పోటీ పడ్డారు. జనసేన నుంచి మరికొందరు పోటీకి రావడంతో బాలరాజు, శ్రీనివాస్ ఒక్కటయ్యారు. తమ ఇద్దరిలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని, మూడో వ్యక్తికి అవకాశం ఇవ్వవద్దని ఇరు పార్టీల అధిష్ఠానాలను కోరారు. చివరికి జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు పేరును ఖరారు చేస్తూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు శనివారం బీఫాం ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కరాటం రాంబాబు, సాయిబాబా, రవికుమార్ తదితరులు ఉన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బాలరాజుది జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2019లో జనసేన తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశారు.

జనసైనికులకు పవన్ భరోసా

ఏలూరు కార్పొరేషన్, మార్చి 23: 'ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతీ ఒక్కరూ కష్టపడాల్సిందే. పరిస్థితుల ప్రభావం వల్ల కొందరికి వారు ఆశించినట్టు టికెట్లు కేటాయించకపోవచ్చు. అందుకు ఎవరూ ఆందోళన చెందవద్దు. అప్రజాస్వామికంగా నియంతపాలన సాగిస్తున్న జగన్‌ను గద్దె దింపి, ఇంటికి పంపించడమే మన లక్ష్యం కావాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కష్టపడిన జన సైనికులు, నాయకులు, కార్యకర్తల భవిష్యత్తుకు నేను భరోసా ఇస్తా' అంటూ పవన్ కల్యాణ్ ప్రకటించారు. మంగళగిరిలో శనివారం జనసేన ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు, తాడేపల్లిగూడెం జనసేన కన్వీనర్ బొలిశెట్టి శ్రీనివాస్, బి.వి.రాఘవయ్యచౌదరిలతో భేటీ అయి రాజకీయ పరిణామాలపై చర్చించారు. టిక్కెట్ రాలేదని బాధపడవద్దు.. అంతకుమించి ప్రాధాన్యం ఇస్తాం.. పార్టీ, కూటమి కోసం కష్టపడి పనిచేయండి' అంటూ అప్పలనాయుడుకు పవన్ భరోసానిచ్చారు. జనసేన ఏలూరు నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీనరేశ్, సరిది రాజేష్, శ్రావణ గుప్త తదితరులు ఉన్నారు.



పవన్‌కల్యాణ్‌తో నాయకులు రెడ్డి అప్పలనాయుడు, రాఘవయ్యచౌదరి, బొలిశెట్టి శ్రీనివాస్

ఏవండీ.. ఇది విన్నారా ?

- పార్టీల్లో కీలక సమాచారం బయటకు..
- కోవర్టులతో అభ్యర్థుల భయాందోళన



నరసాపురం, మార్చి 23 : ఓ పార్టీ అభ్యర్థి ప్రత్యర్థి పార్టీలోని కీలక నేతను కలిసి మద్దతు కోరనున్నట్టు తన సన్నిహితులతో చెప్పాడు. ఈ విషయం బయటకు ఎలా వెళ్లిందో కాని, ప్రత్యర్థి పార్టీ అప్రమత్తమై.. ఆ నేతను కలవనివ్వకుండా చేసింది. ఈ విషయం తెలిసి ఈ నేత అవాక్కయ్యాడు. తన చుట్టూ కోవర్టులు ఉన్నట్టు అర్థమై.. అప్పటి నుంచి ప్రతి విషయాన్ని గట్టుగా చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని పలువురు అభ్యర్థులు ఎదుర్కొంటున్నారు. పార్టీకి సంబంధించిన కీలక సమాచారాలను బయటకు చేరవేస్తుండటంతో బరిలో వున్న అభ్యర్థుల్లో ఆయోమయం నెలకొంది. ఎవరిని అనుమానించాలో తెలియని పరిస్థితి. ఒకవేళ దూరం పెడితే పరిణామాలు ఏ విధంగా ఉంటాయోనని ఆందోళన. ఎక్కడికైనా వెళ్లి.. ఎవరినైనా కలవాల్సి వస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా పని కానిస్తున్నారు. ఈ భయం అధికారపార్టీతోపాటు జనసేనలోనూ ఉంది. సాధారణంగా ఎన్నికల సమయంలో పలువురితో మంతనాలు జరుపుతారు. తటస్థులతో పార్టీల నేతలతో చర్చించి వారి సహకారం కోరతారు. ఆర్థికపర అంశాలను చర్చిస్తారు. పార్టీలో చేరే వారి సమాచారాన్ని చివరి క్షణం వరకు బయటపెట్టరు. ఇలాంటి కీలక విషయాలను కొందరు బయటకు చేరవేస్తున్నారు. దీంతో రెండు పార్టీల నేతల ముఖ్యమైన విషయాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇతర పార్టీల నేతలను సంప్రదించాల్సి వస్తే ఆ విషయాన్ని ముఖ్య అనుచరులతో తప్ప ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. ఇటీవల జనసేన పార్టీకి సంబంధించిన కొన్ని విషయాలు బయటకు వెళ్లాయి. ఇది పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. దీన్ని ఎవరూ లీక్ చేశారన్నది సస్పెన్స్‌గా మారింది.

నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులకు చుక్కలు చూపించేలా టీడీపీ అభ్యర్థులు వేగంగా దూసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నుంచి భారీగా వలసలు ఉండటంతో టీడీపీ, కూటమి అభ్యర్థులంతా ఏ స్థాయిలో, ఎవరెవర్ని పార్టీలో చేర్చుకోవాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటున్నారు. టిక్కెట్ల ఖరారు పూర్తికావడంతో నేరుగా ముఖాముఖి ఢీకొనేందుకే ప్రయత్నిస్తున్నారు.

మిగతా పార్టీల సంగతేంటి?

ఈ సారి ఎన్నికల చిత్రంలో తాము ముందు వరుసలో ఉంటామంటూ కాంగ్రెస్ కాస్త కేడర్‌లో ఊపిరి పోసింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల రంగంలోకి దిగడంతో ఆ పార్టీకి ఊపు వచ్చింది. అభ్యర్థుల ఎంపికలో ఇంకా ఆ పార్టీ వెనుకబడే ఉంది. నియోజకవర్గాల వారీగా ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆ మేరకు వడబోసి ఆ తదుపరి ఏఐసీసీ ఆమోదంతో అభ్యర్థుల జాబితాను వెలువరించాల్సి ఉంది. ఇప్పటి వరకు పీసీసీ స్థాయిలోనే వడపోత కొనసాగుతోంది. ప్రధాన పక్షాలేమో తమ అభ్యర్థులను ప్రకటించి దూసుకుపోతుండగా కాంగ్రెస్‌లో ఆ స్థాయిలో ఇంకా వ్యవహారం స్పీడ్ అందుకోలేదు. కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధపడినా కమ్యూనిస్టుల పరిస్థితి ఇదే మాదిరి ఉంది. పోలవరం నుంచి సీపీఐ పోటీ చేయాలని ఒక నిర్ణయానికి వచ్చింది. ఆ మేరకు కాంగ్రెస్‌కు ప్రతిపాదించింది. ఈ వ్యవహారం కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికతోపాటు ఖరారు కానుంది.

FORM NO.4
Proclamation requiring the appearance of a person Accused (Under section 82)
IN THE COURT OF THE III SPECIAL MAGISTRATE, VIJAYAWADA.
C.C.No: 31/2020

Between:
M/s. Posani Nageswara Rao, Mogalrajpuram,Vijayawada-10. ..... Complainant
And
Pilagalla Nagaraju, Kovali-534449. ..... Accused

Whereas Complainant has been made before me that **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** Prop: Sri Siva Satya Sai Agencies, Besides Lane of Venkateswara Swamy Temple, Kovali-534449, Danduluru Mandalam, Eluru Dist., has committed the offence of 138 of Negotiable Instrument Act and it has been returned to a warrant of arrest there upon issued that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** cannot be found and where as it has been shown to my satisfaction that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** has abscond or is concealing himself to avoid the service of warrant.

Proclamation is hereby made that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** is required to appear at III Special Magistrate Court, Vijayawada before this court or before me to answer the said complaint on the 23rd day of April, 2024. Publication in Andhra Jyothi Telugu daily Newspaper.

Dated, this 22nd day of March,2024.
(Seal of the court)

III Special Magistrate
VIJAYAWADA.

FORM NO.4
Proclamation requiring the appearance of a person Accused (Under section 82)
IN THE COURT OF THE III SPECIAL MAGISTRATE, VIJAYAWADA.
C.C.No: 28/2020

Between:
M/s. Posani Farm Chemicals Pvt. Ltd., Mogalrajpuram,Vijayawada-10. ..... Complainant
And
Pilagalla Nagaraju, Kovali-534449. ..... Accused

Whereas Complainant has been made before me that **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** Prop: Sri Siva Satya Sai Agencies, Besides Lane of Venkateswara Swamy Temple, Kovali-534449, Danduluru Mandalam, Eluru Dist., has committed the offence of 138 of Negotiable Instrument Act and it has been returned to a warrant of arrest there upon issued that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** cannot be found and where as it has been shown to my satisfaction that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** has abscond or is concealing himself to avoid the service of warrant.

Proclamation is hereby made that the said **Pilagalla Nagaraju, Son of Pilagalla Subba Rao,** is required to appear at III Special Magistrate Court, Vijayawada before this court or before me to answer the said complaint on the 23rd day of April, 2024. Publication in Andhra Jyothi Telugu daily Newspaper.

Dated, this 22nd day of March,2024.
(Seal of the court)

III Special Magistrate
VIJAYAWADA.

తప్పుడు సమాచారం పోస్టింగ్ పెడితే..


90300 04969కు ఫిర్యాదు చేయండి : ఎస్పీ



ఏలూరు క్రైం, మార్చి 23 : సోషల్ మీడియాలో పెట్టే పోస్టింగులపై నిఘా ఉంచాం. తప్పుడు సమాచారంతో సోషల్ మీడియాలో రెండు వర్గాల మధ్య విబేధాలకు దారితీసేలా, ద్వేషాలు పెంచేలా పోస్టింగులు పెడితే అలాంటి వారి సమాచారాన్ని వాట్సప్ నెంబర్ 90300 04969కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని ఎస్పీ మేరీ ప్రశాంతి ఎస్పీ తెలిపారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారు. ఎవరైనా సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడితే ఐపీసీ 153 (ఎ) ఐటీ చట్టం కింద మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడితే 67 సెక్షన్ ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేస్తే గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడుతుంది. ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని వేధిస్తే తీవ్ర నేరంగా పరిగణించి వారిపై ఐపీసీ సెక్షన్ 354 కింద గరిష్ఠంగా ఐదేళ్ల జైలు, జరిమానా విధించబడుతుంది. కొంతమంది విద్యార్థులు సరదాగా సామాజిక మాధ్యమాల్లో రాజకీయాలకు సంబంధించి విద్వేషాలు కలిగించేలా పోస్టింగులు పెడుతున్నారు. క్రిమినల్ కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు రావు. విదేశాలకు వెళ్లే అవకాశం కోల్పోతారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే వారిపై ఉన్నికల ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తాం' అని పేర్కొన్నారు. ఏఎస్పీ జి.స్వరూప రాణి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బొమ్మ తెచ్చిన తంటా!

- ధ్రువపత్రాలన్నింటిపైనా సీఎం చిత్రం
- ఎన్నికల కోడ్‌తో సచివాలయాల్లో నిలిచిన సర్టిఫికెట్ల జారీ



ఏలూరు రూరల్, మార్చి 23 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో ధ్రువీకరణ పత్రాల మంజూరుకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. గ్రామవార్డు, సచివాలయాల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అన్ని ధ్రువపత్రాల్లో సీఎం జగన్ ఫొటో ఉండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వాటి జారీని నిలిపివేశారు. దీంతో రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం. రైతులకు వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయాలంటే బ్యాంకులకు వన్(బీ) జతపరచాలి. వీటితోపాటు ఈ-పాస్, అడంగల్, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాల కోసం వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడ సిబ్బంది వాటిని తీసుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తిరస్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, రైతులు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఆగాలా అంటూ సచివాలయ సిబ్బందిపై ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు సర్టిఫికెట్ల జారీకి సంబంధం ఏమిటని నిలదీస్తున్నారు. ధ్రువపత్రాలపై సీఎం జగన్ చిత్రం ఉండడం వల్ల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాటిని జారీ చేయలేమని అధికారులు సమాధానం ఇస్తున్నారు. దీంతో ధ్రువపత్రాలపై రాజకీయ నాయకుల చిత్రాలు ఎందుకు ముద్రిస్తున్నారని, గతంలో ఎప్పుడూ ఇలా లేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాకే ఇటువంటి చిత్రాలు చూస్తున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, సీఎం జగన్ చిత్రాలు లేని పత్రాలు వచ్చిన తరువాతే సర్టిఫికెట్లు జారీ చేస్తామని ప్రస్తుతా నికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటం లేదని అధికారులు తెలుపుతున్నారు. సచివాలయ పరిధిలో కుల, ఆదాయ, ధ్రువపత్రాలకు సంబంధించి తక్కువస్థాయిలో సామగ్రి మంజూరైంది. గతంలో సీఎం జగన్ ఫొటోతో ఉన్న ధ్రువీకరణ పత్రాలు జారీని నిలుపుదల చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు సీఎం జగన్ నవరత్నాల చిత్రాలను తొలగించి నూతనంగా ముద్రించిన పత్రాలు సచివాలయాలకు వచ్చినట్లు తెలిసింది. ప్రతి సచివాలయానికి 100 చొప్పున ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. బియ్యం కార్డులు, పింఛన్లతో పాటు పథకాలకు సంబంధించి పత్రాలు మంజూరు నిలుపుదల చేశారు. కుల,ఆదాయ, ధ్రువీకరణ పత్రాలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. లోగోలు లేని సర్టిఫికెట్లు ఇక నుంచి జారీ చేయనున్నారు.

నాన్ బెయిలబుల్ వారంట్లపై స్పెషల్ డ్రైవ్

▸ ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 23 :ఎన్ఐ యాక్టు కింద జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారంట్ల అమలుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించి నాన్‌బెయిలబుల్ వారంట్ల అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. ఈ క్రమంలో వారం రోజుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్లు అమలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అప్పు తీసుకుని కేసుల్లో ఉన్న వారు ఇప్పటికే నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన వారు తాము అరెస్టు చేయకముందే కోర్టులో లొంగిపోయి బెయిల్ పొందాలని సూచించారు. వారం రోజుల తరువాత నాన్‌బెయిలబుల్ వారంట్ల అమలుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎక్కడ ఉన్నా కచ్చితంగా అరెస్టు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

టి.నరసాపురం/చింతలపూడి, మార్చి 23 :ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు, నాగిరెడ్డిగూడెం గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రహ్మాండేశ్వరమ్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో యాభై పాఠశాలలు, పది జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాల మొత్తం 61 విద్యాలయాలు నడపబడుతున్నాయన్నారు. ఈ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఏప్రిల్ 25న పాఠశాల విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నా 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 31 లోపు మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పాఠశాల విద్యార్థులు రూ.100, కళాశాల విద్యార్థులు రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏలూరులో 'అనన్య' చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న హీరో, హీరోయిన్

ఏలూరు కల్చరల్, మార్చి 23 : ఏలూరులో అనన్య చిత్రం యూనిట్ సభ్యులు శనివారం సందడి చేశారు. స్థానిక సాయిబాలాజీ థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శితమవుతోంది. ఉదయం ఆట సమయంలో అనన్య చిత్రంలోని హీరో, హీరోయిన్లు ప్రేక్షకు లను ఉత్సాహపరిచారు. ఏలూరు మాదేపల్లి గ్రామానికి చెందిన జుత్తిగ జయరామన్ హీరోగా నటించారు. ప్రేక్షకులను సినిమా డైలాగులు చెప్పి అలరించారు. అనంతరం విలేకర్ల సమావే శంలో హీరో మాట్లాడుతూ ఈ చిత్రం కుటుంబసభ్యులందరిని అలరిస్తుందని, హర్రర్, ప్రేమ, కామెడీతో వినూత్నంగా రూపొందించామన్నారు. మరో హీరో సుమన్ ముఖ్యపాత్రలో పోషించారని, జబర్దస్త్ కమెడియన్లు కామెడీ ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రం షూటింగ్ చేశామన్నారు. హీరోయిన్ చందన మాట్లాడుతూ బంధుత్వాలు, బాంధవ్యాలతో కూడిన ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలన్నారు. డైరెక్టర్ బొమ్మిడి ప్రసాద్‌రాజు, నిర్మాత గంగాధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోతున్న '108' వాహనం

▸ ఏలూరులో స్టీరింగ్ పట్టేసిన అంబులెన్స్.. తప్పిన పెను ప్రమాదం



ఆసుపత్రి అత్యవసర గేటు సమీపంలో కరెంటు స్తంభం వద్ద నిలిచిన అంబులెన్స్

ఏలూరు క్రైం, మార్చి 23 : జిల్లాలో ఉన్న 108 అంబులెన్స్‌లు కుయ్యో మొర్రో అంటూ మూలుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ మార్గమధ్యలోనే ఆగిపోతున్నాయి. కామవరపుకోటకు చెందిన 108 అంబులెన్సులో ఒక పేషెంటును ఏలూరుకు తీసుకువస్తున్నారు. ఆ అంబులెన్సు అత్యవసర విభాగపు మెయిన్ గేటు లోంచి వస్తుండగా స్టీరింగ్ పట్టేసింది. దీంతో వేరే గేటులోకి వెళ్లి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టే సమయంలో డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేసి ఆపాడు. పెను ప్రమాదం తప్పినట్టు అయింది. చివరకు అంబులెన్స్‌కు రెండు గంటల వ్యవధిలో మరమ్మతులు చేసి అక్కడ నుంచి తొలగించారు. అప్పటివరకూ అత్యవసర విభాగంలోని ఒక గేటును మూసివేసి ఉంచారు.



ప్రమాదానికి గురైన బస్సు(ముందే ధ్వంసమైన అద్దం భాగం)



పేలిన బస్సు టైరు

పేలిన ఆర్టీసీ బస్సు ముందు టైరు

▸ పెద్ద శబ్ధం రావడంతో ప్రయాణికుల భయాందోళన

▸ త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

▸ కండీషన్ లేని సిటీ బస్సులేమిటని భక్తుల ఆగ్రహం

ద్వారకాతిరుమల, మార్చి 23: కండీషన్‌లో లేని ఆర్టీసీ బస్సులను రహదారులపై పంపి సంస్థ అధికారులు ప్రయాణికుల ప్రాణాలతో ఆడుకుంటున్నారనడానికి ఈఘటనే నిదర్శనం. శనివారం ఉదయం ద్వారకాతిరుమల నుంచి విజయవాడకు ప్రయాణికులతో బయలుదేరిన గవర్నర్‌పేట డిపో బస్సు సత్యన్నారాయణపురం వద్ద హైవేపై ముందు టైరు పేలి పెద్ద శబ్ధం వచ్చింది. బస్సు మెలికలు తిరుగుతూ వెళ్తుండడంతో ప్రయాణికులు భీతిల్లి కేకలు వేశారు. డ్రైవర్ చాకచక్యంతో బస్సును మార్జిన్ పక్కన సురక్షితంగా నిలిపివేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమయంలో వెనుక వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి ద్వారకాతిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులు చాలా వరకు విజయవాడ సిటీలో తిరిగే బస్సులను వినియోగిస్తున్నారు. ఇవి కండీషన్‌లో ఉండడం లేదని, సీట్లు కూడా దూరప్రయాణాలకు ఉపయోగపడకుండా, లగేజీ ఉంచుకునేందుకు అవకాశం లేదని యాత్రికులు చెబుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండి అధిక ఆదాయం వచ్చే ద్వారకాతిరుమల క్షేత్రానికి సిటీ బస్సులను పంపడమేమిటని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ద్వారకాతిరుమలకు సిటీబస్సులు కాకుండా కండీషన్‌లో ఉండే సాధారణ బస్సులను పంపాలని పలువురు కోరుతున్నారు.

23-03-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	240	237	239.60
జంగారెడ్డిగూడెం-1	240	235	239.61
జంగారెడ్డిగూడెం-2	240	235	239.48
కొయ్యలగూడెం	241	235	239.92
గోపాలపురం	240	235	239.60

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)


EDUCATION

Join by 25th BA Rs 5500, B.Com 6k B.Sc 10k, PG Arts 8K, yearly in Distance at PLNM Degree College, 9177408565, 9642656449, MBA 16k, MCA 20k Sem.
AJG-184906

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, లేదా ఇతర మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

పంచాయతీలకు పరాభవం



విద్యుత్ బిల్లుల షాక్

వైసీపీ పాలనలో అంతా అవమానాలే

పంచాయతీలు పరాభవం చవిచూస్తున్నాయి. బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. బిల్లులు కట్టని పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తోంది. గడచిన ఏప్రిల్ నుంచి జిల్లాలో పంచాయతీలు రూ.21.50 కోట్లు బకాయి పడ్డాయి. అంతకు ముందు బకాయిలు దాదాపు 75.00 కోట్ల మేర ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు సమకూరలేదు. ఒక్క ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడుతున్నాయి. గతంలో ఇతర పథకాల ద్వారా నిధులు వచ్చి పడేవి. వైసీపీ పాలనలో అంతా తిరోగమనంలో పంచాయతీలు నడుస్తున్నాయి. అభివృద్ధికి దూరమై అప్పుల పాలయ్యాయి. ఈక్రమంలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కష్టమవుతోంది. ఒక దశలో ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను మళ్లించింది. విద్యుత్ బిల్లులకు సర్దుబాటు చేసింది. ఇటీవల కాలంలో ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నుంచి ఇప్పటివరకు మూడు క్వార్టర్‌లు మంజూరు చేశారు. సుమారు రూ.61.00 కోట్లు పంచాయతీ ఖాతాల్లో వచ్చి పడ్డాయి. ప్రభుత్వం చేతులెత్తేసింది. విద్యుత్ బిల్లులను పంచాయతీల నుంచే వసూలు చేసుకోవాలంటూ విద్యుత్ శాఖకు దిశానిర్దేశం చేసింది. అప్పటినుంచి విద్యుత్ శాఖ అధికారులు పంచాయతీల వెంటపడుతున్నారు.

బిల్లుల భారం

పంచాయతీలకు విద్యుత్ భారం అధికమైంది. బిల్లులు పెరిగిపోయాయి. రెట్టింపు బిల్లు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీలకు మూడు రెట్లు మేర బిల్లులు వస్తున్నాయి. ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు ప్రభావం పంచాయతీలకు తాకింది. సచివాలయాల బిల్లులను కూడా పంచాయతీలే చెల్లిస్తున్నాయి. వాటి నిర్వహణ భారాన్ని మోస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఒక్కపైసా కూడా మంజూరు చేయడం లేదు. పంచాయతీలకు సచివాలయాలపై ఎటువంటి అజమాయిషీ లేదు. సర్పంచ్‌లకు కూడా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థపై అజమాయిషీ లేకుండా పోయింది. ఈవిధంగా విధుల్లోనూ వైసీపీ పానలో సర్పంచ్‌లకు కోత పడింది. మరోవైపు నిధులు లేవు. మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ కోసమే పంచాయతీలు ఆపసోపాలు పడుతున్నాయి.

పెనుమంత్ర, పెనుగొండ మండల గ్రామాలకు ట్రాన్స్‌కో నోటీసుల జారీ

ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పవర్ కట్

పెనుమంత్ర, మార్చి 23 : గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు గ్రామ పంచాయతీలకు పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కార్యదర్శులకు ప్రత్యేక, అధికారులకు నోటీసులు జారీ చేసింది. బిల్లులు చెల్లించని పక్షంలో తొలుత గ్రామ పంచాయతీ పవర్ కట్ చేస్తామని, తదుపరి వీధిలైట్లకు సరఫరా నిలిపివేస్తామన్నారు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు పంచాయతీలకు కరెంట్ కట్ చేశారు.

నోటీసులందుకున్న గ్రామాలు..

పెనుమంత్ర మండలంలో 14 గ్రామాలు.. భట్లమగుటూరు, గరువు, జుత్తిగ, కొయ్యేటి పాడు, మల్లిపూడి, మాముడూరు, మార్టేరు, నెగ్గిపూడి, నెలమూరు, ఓడూ రు, పెనుమంత్ర, సత్యవరం, వీవీపాలెం, వెలగలేరు. పెనుగొండ మండలంలో 11 గ్రామాలు.. దేవ, ఇలపర్రు, ములపర్రు, కొట్టాలపర్రు, మునమర్రు, నడిపూడి, పెనుగొండ, రామన్నపాలెం, సోమరాజుచెరువు, తామరాడ, వెంకటరాంపురం ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో బిల్లులు చెల్లించకపోతే ఆయా గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ నోటీసులు జారీ చేసిందని పెనుగొండ ఎలక్ట్రికల్ ఏడీఏ కె. రాంబాబు తెలిపారు. అధికారులు, పాలకులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సర్పంచ్‌లకు దక్కని కనీస గౌరవం..

సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు కూడా పూర్తిచేయలేని పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. ఇక రహదారుల అభివృద్ధి అంతంత మాత్రమే. గతంలో అధికార పార్టీలో సర్పంచ్‌లకు ప్రత్యేక గౌరవం ఉండేది. గ్రామాల్లో వారిమాటే చెల్లుబాటు అయ్యేది. నిత్యం అభివృద్ధిలో తలమునకలయ్యేవారు. సర్పంచ్‌ల కనుసన్నల్లోనే నిధులు వెచ్చించేవారు. సంక్షేమ పథకాలు అమలు జరిగేవి. ఇప్పుడంతా ప్రభుత్వమే వలంటీర్లు, సచివాలయాల ద్వారా పంచాయతీలపై పట్టు బిగించింది. సర్పంచ్‌లకు కనీస మర్యాద లేకుండాపోయింది. ఇప్పుడు విద్యుత్ బిల్లుల రూపంలో పంచాయతీలు సతమతమవుతున్నాయి.

ఇరుకు గదుల వల్లే పిల్లలకు చిరువ్యాధులు

▸ ఆశ్రమ పాఠశాలలో డీఎంవో సురేష్‌కుమార్ సందర్శన ▸ అనారోగ్యంతో బాధపడుతున్న వైశాలికి వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తెల్లంవారిగూడెం ఆశ్రమ పాఠశాల బాలికలతో మాట్లాడుతున్న డీఎంవో

బుట్టాయగూడెం, మార్చి 23 : ఆశ్రమ పాఠశాలలో సరిపడ గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే ఉంటున్నందున తరచూ చిరువ్యాధుల బారిన పడుతున్నట్టు ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి, డీఎంవో జె.సురేష్‌కుమార్ తెలిపారు. కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి అనారోగ్యం పేరుతో ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వైరల్ ఫీవర్స్ అదుపులోనే ఉన్నాయన్నారు. అనారోగ్యం బారిన పడిన గోరం డమరిక వైశాలికి వైద్యసేవలు అందించామన్నారు. జ్వరం అదుపులోనే ఉన్నట్టు తెలిపారు. పాప ఇంటికి వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులతో పంపించామన్నారు. దొరమామిడి ఆసుపత్రిలో కొందరు వైద్యసేవలు పొందుతున్నారన్నారు. ఇరుకుగా ఉన్న గదుల విషయాన్ని పీవో దృష్టికి ఎందుకు తీసుకువెళ్ల లేదని హెచ్‌ఎం వసుంధరను ప్రశ్నించారు. పిల్లలకు ఇబ్బందులు లేకుండా విశాలమైన గదులు ఉంటే ఎటువంటి రోగాలు దరిచేరవని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. చిరువ్యాధులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, శుభ్రతపట్ల జాగ్రత్తగా ఉండాలని, నాణ్యమైన ఆహార పదార్థాలనే పిల్లలకు పెట్టాలన్నారు. వంటశాలలో వంటలను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, వైద్యాధికారి డాక్టరు నందిని, ఏఎంవో శ్రీను, వార్డెన్ ఉదయశ్రీ సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

మనుమడి ఇంటికి వెళుతూ.. వృద్ధుడి మృతి

జంగారెడ్డిగూడెం, మార్చి 23 :గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంకు చెందిన నంబూరి ఆనందరావు(65) జంగారెడ్డిగూడెం పట్టణంలో గరుడ పక్షినగర్ వద్ద నివాసం ఉంటున్న తన మనుమడి ఇంటికి వచ్చేందుకు పంగిడిగూడెం నుంచి బయలుదేరాడు. స్థానిక బైపాస్ రోడ్ మీదుగా మనుమడి ఇంటికి వెళుతున్న వృద్ధుడిని గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి ఢీకొని అక్కడ నుంచి వెళ్లిపోయింది. కిందపడిన వృద్ధుడిని స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు.

ట్రాన్స్‌పోర్టు కంపెనీపై దాడి.. పలువురిపై కేసు

జంగారెడ్డిగూడెం, మార్చి 23 : ట్రాన్స్‌పోర్టు కార్యాలయం, నిర్వాహకుడిపై దాడి ఘటనలో పలువురిపై కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం ఎస్‌ఐ జ్యోతిబసు తెలిపారు. వివరాలివి.. దత్తసాయి ట్రాన్స్‌పోర్ట్‌ను పట్టణానికి చెందిన వీరమాచినేని పూర్ణఅజయ్‌కుమార్ లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. ఈ నెల 22న పట్టణంలోని రాయల్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి చెందిన వ్యక్తి అజయ్‌కు ఫోన్ చేసి కలిసి వ్యాపారం చేద్దామన్నారు. దీనికి ఆయన నిరాకరించడంతో అదే రోజు సాయంత్రం సురేంద్ర, గణేష్, కమలాకర్ మరికొందరు దత్తసాయి ట్రాన్స్‌పోర్టు కార్యాలయంపై దాడి చేసి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తనపై దాడి చేసి, సెల్‌ఫోన్, బంగారు గొలుసు, రూ.9,150 నగదు తీసుకువెళ్లినట్టు బాధితుడు అజయ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. వేగవరానికి చెందిన పొడపాటి రాణి రాయల్ ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ యజమాని సురేంద్ర, అతడి మేనల్లుడు రూపక్‌లతో కలిసి ఆమె పార్శిల్స్ రేటుకు సంబంధించి దత్తసాయి ట్రాన్స్‌పోర్టుకు వెళ్లారన్నారు. ఈ క్రమంలో ట్రాన్స్‌పోర్టు యజమానుల మధ్య జరిగిన ఘర్షణలో అజయ్ రాణిని నెట్టివేయడంతో ఆమె గాయపడింది. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

క్రెడిట్‌కార్డు అప్‌డేట్ చేస్తామని రూ.92,650 మాయం

ఏలూరు క్రైం, మార్చి 23 : ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తాను బ్యాంక్ అధికారినని క్రెడిట్ కార్డు నంబరు అడిగి అప్‌డేట్ చేస్తామని నమ్మబలికి అతడి ఖాతాలోని నగదు స్వాహా చేశారని ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు సమీపంలోని ఇంద్రప్రస్థకు చెందిన బదురు వెంకటేశ్వరప్రసాద్‌కు ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. దఫదఫాలుగా రూ.92,650 డ్రా చేసుకున్నాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో కారు నడిపి..

▸ మరో కారును ఢీకొట్టిన వైనం.. ముగ్గురికి గాయాలు..

▸ ఆసుపత్రి నుంచి మద్యం బాబులు పరార్



గాయాలపాలైన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు

ఏలూరు క్రైం, మార్చి 23 : మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీ కొట్టడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. విజయవాడలోని గొల్లపూడికి చెందిన బోడావుల సోమేశ్వరరావు ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తన కుమారుడు ప్రీతీచంద్ర ఆయన తమ్ముడు నాగబాబు కలిసి కారులో ఏలూరు వస్తున్నారు. ఏలూరు సమీపంలోని వట్లూరు రైల్వే బ్రిడ్జిపై కారు వస్తుండగా ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే కారు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా కారును ఢీ కొట్టాడు. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. ఢీకొన్న కారులో డ్రైవర్‌తోపాటు నలుగురు వ్యక్తులు కూడా ఫూటుగా మద్యం తాగి ఉన్నారు. గాయాలపాలైన ముగ్గురిని 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్, ఆ కారులతో ఉన్న వారు కూడా ఆసుపత్రికి రాగా వారి నుంచి రక్తనమూనాలు సేకరించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. దీంతో ఆసుపత్రి నుంచి వారు పరారయ్యారు.

నాబార్డు రుణాలు ఇప్పిస్తానని చీటింగ్

▸ ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై కేసు నమోదు



ప్రభుదాసును తీసుకువెళ్లేందుకు వచ్చిన పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 23 : నాబార్డు ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి పలువురి నుంచి సొమ్ములను తీసుకుని నకిలీ చెక్కులు ఇచ్చి మోసగించడంపై కేసు నమోదు చేశామని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు ఎన్ఆర్ పేటనకు చెందిన ఎస్.నాగలక్ష్మి రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురుగా జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన దొండపాటి ప్రభుదాసు అనే వ్యక్తి తరచూ జిరాక్స్ తీయించుకోవడానికి వస్తూ నోటరీలు చేయిస్తున్నాడు. ఆ నోటరీలు ఎందుకు చేయించుకుంటున్నారని ఆమె అడుగగా నాబార్డు నుంచి 50 శాతం సబ్సిడీతో రుణాలు వస్తున్నాయని నమ్మబలికాడు. ఆమెకు మూడు లక్షల రూపాయలు రుణం ఇప్పిస్తానని ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.30 వేలు కట్టాలని చెప్పడంతో ఆమెతో పాటు, షాపులో పనిచేసే వారు, బంధువులు మొత్తం 17 మంది కలిసి నాలుగు లక్షల 36 వేల రూపాయలు చెల్లించారు. ఈనెల 21వ తేదీన ప్రభుదాసు రూ.60 లక్షలకు ఒక చెక్కు తెచ్చి ఇచ్చారు. ఆ చెక్కు తీసుకుని వారు బ్యాంక్‌కు వెళ్లగా అది తప్పుడు చెక్కు అని, అతడి వ్యక్తిగత బ్యాంక్ చెక్కు అని, నాబార్డు స్టాంప్ వేసి రబ్బరు స్టాంపులు తయారు చేయించి స్టాంపులు వేశాడని బ్యాంకు అధికారులు తెలిపారు. ఈక్రమంలో బాధితులకు శనివారం ఏలూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి వద్ద ప్రభుదాసు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చి అతడిని స్టేషన్‌కు తీసుకువచ్చి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



నాటు సారాను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

గంజాయి, సారా, మద్యాన్ని నియంత్రిస్తాం

▸ ఎస్‌ఈబీ డీఎస్పీ జనార్దననాయుడు

కుక్కునూరు, మార్చి 23 : రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గంజాయి, సారా, మద్యాన్ని నియంత్రిస్తామని డీఎస్పీ జనార్దననాయుడు తెలిపారు. కుక్కునూరు మండలంలో శనివారం ఎస్‌ఈబీ బృందం పర్యటించింది. వేలేరులో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి, దాదాపు ఆరు వేల లీటర్ల బెల్లపు ఊట, 90 లీటర్ల సారా ధ్వంసం చేశారు. వేలేరు వద్ద ఉన్న ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కుక్కునూరు మండలంలో ఇసుక అక్రమ రవాణాతో పాటు పేకాట, కోడిపందేలు తెలంగాణ నుంచి అక్రమ మద్యం, సారా విస్తృతంగా తయారీ అవుతుందని ఆరోపణలు వస్తున్నాయన్నారు. శుక్రవారం రాత్రి కూడా ఇసుక అక్రమ రవాణా జరిగిందని ఫిర్యాదు వచ్చాయన్నారు. ఈ మేరకు మండలంలో ఉన్న ఇసుక ర్యాంప్‌లు, పేకాట జరిగే స్థావరాలను పర్యవేక్షించామన్నారు. ఎస్‌ఈబీ సీఐ సునీల్‌కుమార్, ఏఎస్ఐ పూర్ణ, కుక్కునూరు సీఐ శ్రీనిఎవాసరావు పాల్గొన్నారు.



పేకేరులో రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

పేకేరులో హడావుడిగా రోడ్డు నిర్మాణం

▸ ఎన్నికల కోడ్‌పై నిలదీసిన స్థానికులు.. నిలిచిన పనులు

ఇరగవరం, మార్చి 23 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికి పలు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పేకేరు గ్రామంలోని పతివాడవారి వీధిలో 58 మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఎంతోకాలంగా ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నా సిమెంటు రోడ్డు వేసేందుకు వైసీపీ నాయకులు కాలయాపన చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత హడావుడిగా శనివారం రోడ్డు నిర్మాణం చేపట్టారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు నిర్మాణం ఏమిటని కొంతమంది స్థానికులు ప్రశ్నించి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు వచ్చి రోడ్డు నిర్మాణాన్ని ఆపివేశారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ స్పందిస్తూ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నట్లు తనకు తెలియదని, తెలిసిన వెంటనే పనులు నిలుపుదల చేశామన్నారు.

వెంకన్న సన్నిధిలో భక్తుల రద్దీ



శ్రీవారి అనివేటి మంటపంలో భక్తులు

ద్వారకాతిరుమల, మార్చి 23: చినవెంకన్న ఆలయాన్ని శనివారం పలువురు భక్తులు సందర్శించారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈక్రమంలో ఆలయం లోని అన్ని విభాగాలు భక్తులతో కళకళలాడాయి. తమ మొక్కుబడులను తీర్చుకున్న అనంతరం భక్తజనులు స్వామి, అమ్మవార్లను క్యూలైన్లలో వెళ్లి దర్శించుకుని తరించారు. సుమారు 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా. ఈ సందర్భంగా ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామిని దర్శించుకున్న అనంతరం వారంతా ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

▸ పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వరరావు

వీరవాసరం, మార్చి 23 : సమాజంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం వీరవాసరం పీహెచ్‌సీలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, నవజాతి శిశువులకు సకాలంలో వైద్యసేవలు అం దించి తద్వారా మాతృ, శిశు మరణాలు తగ్గించాలన్నారు. సీహెచ్‌వో, ఎంఎల్ ఎంపీలకు ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్యులు పి.నరేష్, పి.అనిల్‌కుమార్, పి.సత్యనారాయణరాజు, ఎస్.మెహాసినాతాజ్ , సీహెచ్‌వో ఎ. దేవదాసు, పాలకోడేరు, తుందుర్రు, వీరవాసరం, పెదకాపవరం, కొణితవాడ, పీహెచ్‌సీల సీహెచ్‌వో, ఎంఎల్‌ఎంపీలు శిక్షణకు హాజరయ్యారు.

ఓల్డేజీ హోమ్‌కి వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని ఓల్డేజీ హోమ్‌లో చేర్చిన దృశ్యం

కడియం, మార్చి 23: ఓ గుర్తుతెలియని వృద్ధురాలిని రాజమహేంద్రవరం జిల్లా కడియం పోలీసులు శనివారం ఓల్డేజీ హోమ్‌కు తరలించారు. సీఐ బి.తులసీధర్ తెలిపిన వివరాలివి.. స్థానిక వెంకయమ్మపేటలో ఓ వృద్ధురాలు తిరుగుతుండగా విషయాన్ని గమనించిన గ్రామస్థులు కడియం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించారు. ఆమె వివరాలు సేకరించగా తన పేరు తుపాకుల సత్యవతి అని, భర్త శాస్త్రి అని భీమవరంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నారని, తనకు సుశీల, మణి, చిన్ని అనే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని చెబుతోంది. తన పుట్టినిల్లు తణుకు అని, తమ్ముడు ఆంజనేయ భీమవరంలో ఉంటున్నాడని వృద్ధురాలు తెలిపింది. ఆ వృద్ధురాలిని వేమగిరి ఓల్డేజీ హోమ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

వేర్వేరుచోట్ల రూ.4.21 లక్షల నగదు స్వాధీనం



కామవరపుకోటలో కారుకు వున్న వైసీపీ జెండా తొలగిస్తున్న ఎన్నికల అధికారులు

కామవరపుకోట, మార్చి 23 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల ఎన్నికల అధికారి ఎం.డి.మొహిద్దీన్ కొత్తూరు ఆర్‌అండ్‌బీ బంగ్లా నాలుగు రోడ్ల కూడలి వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ వ్యక్తి ఎటువంటి పత్రాలు లేకుండా చిన్నకారులో లక్షా 60 వేల రూపాయలు తీసుకువెళ్తుండగా ఆ నగదును సీజ్ చేశామన్నారు. ఒక వైసీపీ నాయకుడు తన కారుకు అనుమతి లేకుండా పార్టీ జెండా కట్టుకుని వెళ్తుండగా ఆ జెండాను తొలగించినట్టు తెలిపారు.

ఉంగుటూరు, గణపవరంలలో..

ఉంగుటూరు,మార్చి 23:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉంగుటూరు టోల్ గేట్, గణపవరంలలో జరిపిన వాహన తనిఖీలలో రూ.2.61 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి తెలిపారు. ఉంగుటూరు చెక్ పోస్ట్ వద్ద జరిపిన తనిఖీలలో ఒక వాహనదారుడి వద్ద రూ.99వేలు, మరొకరి వద్ద రూ.1.01 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గణపవరం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.61వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు రిటర్నింగ్ అధికారి ఖాజావలి విలేకరులకు తెలిపారు. దాడులలో చేబ్రోలు ఎస్‌ఐ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు


పెదవేగిలో పరీక్షకు వెళుతున్న విద్యార్థులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 23: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన భౌతికశాస్త్రం పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 24,132 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 23,219 మంది, ప్రైవేటు విభాగంలో 5,237 మంది దరఖాస్తు చేసుకోగా 2,159 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

● పెదవేగి: పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 1027 మంది మంది పరీక్ష రాయాల్సి ఉండగా 918 మంది హాజరయ్యారని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. ఆరు కేంద్రాల్లో కలిపి 109మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్సా సదుపాయం కల్పించామని ఎంఈవో వివరించారు.

● పోలవరం: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 152 మంది విద్యార్థులకు 120 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది, కచేరి వద్ద సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 118 మంది విద్యార్థులకు 70 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, మూర్తి తెలిపారు.

పరీక్షల సమయంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


పరీక్షా కేంద్రం పరిశీలిస్తున్న ఐటీడీఏ డీడీ

జీలుగుమిల్లి, మార్చి 23: పరీక్షల సమయంలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ డీడీ పీవీఎస్ నాయుడు అన్నారు. బర్రింకలపాడులో పదో తరగతి పరీక్షా కేంద్రాల్ని శనివారం ఆయన పరిశీలించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జీలుగుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతితోపాటు ఇతర తరగతుల విద్యార్థులను పరీక్షల సమయంలో ఉదయం, సాయంత్రం చదివించాలన్నారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మెనూ అమలుపై సిబ్బందితో చర్చించారు.

పోటీ పరీక్షలకు స్వచ్ఛంద సంస్థ ఉచిత శిక్షణ


సంస్థ నిర్వాహకులతో ఆర్పీఎఫ్ ఎస్ఐ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 23: రైల్వే పోలీస్, త్రివిధ దళాలు, అటవీ శాఖ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్వచ్ఛంద సేవా సంస్థ ఫ్యూచర్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆర్పీఎఫ్ ఎస్ఐ శంకరరావు ప్రారంభించారు. అయన మాట్లాడుతూ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాలని సూచించారు. సేవా కార్యక్రమాలతో ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఆదర్శప్రాయంగా నిలిచిందని ప్రశంసించారు. ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులతోపాటు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా ఉచిత శిక్షణ వినియోగించుకోవచ్చునన్నారు. భారత వైమానిక దళం రిటైర్డ్ ఆఫీసర్ లక్ష్మయ్య మాట్లాడుతూ భద్రతా దళాల్లో ఉద్యోగం సాధించాలంటే క్రమశిక్షణ, సమయపాలన అభ్యర్థులు పాటించాలన్నారు. ఎఫ్ఐఎఫ్ చైర్మన్ సతీష్ సావిత్రి మాట్లాడుతూ ఆరు నెలల పాటు నిపుణులతో శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాలకు 81439 74622 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముగిసిన పోషణ పక్వాడా పక్షోత్సవాలు


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో పద్మావతి

ఏలూరు కలెక్టరేట్, మార్చి 23: పోషణ పక్వాడా పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం పవర్‌పేట, యూపీ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో పద్మావతి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ప్రాధాన్యం వివరించారు. వెల్ బేబి షో నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీకి క్రమం తప్పకుండా పిల్లలను పంపించాల్సిన బాధ్యత తల్లులదేనన్నారు. ఈ సందర్భంగా తల్లులను సత్కరించారు. ఎంఈవో రంగయ్య, తంగెళ్ళమూడి పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్, సూపర్‌వైజర్ మౌనిక, మంగ, సత్యవతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: పోషణ, పక్వాడ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా తడికలపూడిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణి, బాలింతలకు ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులకు అందిస్తున్న కిట్‌లను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. సీడీపీవో డి.బ్యూల, పి.సునీల్ రాజశేఖర్, ఏవో మల్లిక, బీపీఎల్.మంగాదేవి, ఎన్.వీరకుమారి పాల్గొన్నారు.

కొల్లేరులో ఆక్రమణల పర్వం

కోమటిలంకలో 40 ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకం

ఏలూరు రూరల్, మార్చి 23 : కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. వందల ఎకరాలను చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. అభయారణ్యంలో ఐదో కాంటూరు పరిధిలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా వాటిని బుట్టదాఖలు చేసి అధికార పార్టీ నాయకులే తవ్వకాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో సుమారు 40 ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులను తవ్వుతున్నారు. ఇందులో 15 ఎకరాలు అభయారణ్యం పరిధిలో ఉంది. అధికార పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి అక్రమంగా చేపల చెరువులు తవ్విస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు అభయారణ్యంలోకి యంత్రాలు ప్రవేశించడం చట్టరీత్యా నేరం. యంత్రాలను తీసుకెళ్లాలంటే తప్పని సరిగా అనుమతి తీసుకోవాలి. కొల్లేరు ప్రాంతానికి కూతవేటు దూరంలోనే చెక్‌పోస్టులు ఉన్నా అధికారులకు తెలిసినా యథేచ్ఛగా చెరువు తవ్వకాలు జరగ డం గమనార్హం. పంట కాల్వల పూడికతీతకు అనుమతి కోరితే నిరాకరించే అధికారులు అక్రమ చెరువులకు అనుమతులు ఎలా ఇస్తున్నారని కొల్లేరు వాసులు మండిపడుతున్నారు.


ముండూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్నఎస్పీ మేరీ ప్రశాంతి


ఏలూరులో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ

ఎన్నికల నియమావళి పాటించాలి : ఎస్పీ

పెదవేగి, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. మండలంలోని ముండూరు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాల్లో భద్రత, గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎస్పీ లక్ష్మయ్య, సీఐ శ్రీనివాస కుమార్, పెదవేగి, దెందులూరు, పెదపాడు ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, స్వామి, శుభశేఖర్‌తో సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి వారు ఎన్నికల నియమావళి అనుసరించి, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని, అప్పుడే ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటువేసే వీలుంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిర్వహణకు అనువైన వాతావరణం, సౌకర్యాలు ఉండాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఆమె వివరించారు.

కోడ్ మీరితే శిక్ష తప్పదు : నగర పాలక సంస్థ కమిషనర్

ఏలూరు టూటౌన్: ఎన్నికల నియామవళికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై ఎన్నిక కమిషన్ చర్యలు తీసుకుంటుందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు, రంగులు తొలగించామన్నారు. ఇళ్ల, ప్రహరీలపై కూడా ఎవరు ఎన్నికల ప్రవర్తన నియామవళికి విరుద్ధంగా రంగులు వేయడం, ఫ్లెక్సీలు కట్టడం చేయరాదన్నారు. అటువంటి వారిపై ఎన్నికల నియమావళిననుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నగర పాలక సిబ్బంది ఎన్నికల నియామవళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఎక్కడా కూడా ఎటువంటి రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు తొలగించడంలో నిమగ్నమై ఉందన్నారు.

రేపటి నుంచి ఇంటర్ కెమిస్ట్రీ, హిస్టరీ మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 23: ఇంటర్మీడియట్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 26 బదులు ఒకరోజు ముందుగా 25 నుంచే ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని డీవీఈవో ప్రభాకరరావు శనివారం తెలిపారు. జిల్లాలోని ప్రతీ కళాశాల నుంచి ఈ సబ్జెక్టుల నుంచి నియమించిన ఎగ్జామినర్లను మూల్యాంకనం విధులకు సోమవారం ఉదయం 10 గంటలకు హాజరయ్యేలా రిలీవ్ చేయాలని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఇవే సబ్జెక్టులకు స్క్రూటినైజర్లుగా నియమితులైన సిబ్బంది ఈనెల 26న ఉదయం 10 గంటలకు స్పాట్ క్యాంప్ వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు. మూల్యాంకనం విధులకు రిపోర్ట్ చేయని ఎగ్జామినర్లు ఒక్కొక్కరికి రోజుకు రూ.వెయ్యి చొప్పున సంబంధిత కళాశాల యాజమాన్యానికి ఇంటర్‌బోర్డు నిబంధనల మేరకు పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

దూరవిద్య పరీక్షలకు 259 మంది గైర్హాజరు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్యా విధానం పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పదో తరగతి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు జిల్లాలో 737 మంది అభ్యాసకులు దరఖాస్తు చేసుకోగా 613 మంది, ఇంటర్మీడియట్ భౌతికశాస్త్రం పరీక్షకు 545 మందికి 493 మంది, రాజనీతిశాస్త్రం పరీక్షకు 752 మందికి 669 మంది హాజరయ్యారని, 259 మంది గైర్హాజరైనట్టు డీఈవో అబ్రహం తెలిపారు. జిల్లాలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

చింతలపూడి సబ్ జైలు తనిఖీ


జైలు రికార్డులు పరిశీలిస్తున్న న్యాయాధికారి

చింతలపూడి, మార్చి 23: స్థానిక సబ్ జైల్‌ను చింతలపూడి న్యాయాధికారి మధుబాబు శనివారం తనిఖీ చేశారు. నిందితులకు ఆహార వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులకు న్యాయ సహాయం కావాలంటే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్న తగాదాలు లోక్ అదాలత్‌లో ప్రిలిటిగేషన్ కేసుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇక్కడ నిందితులకు న్యాయ విజ్ఞానసదస్సు కూడా నిర్వహించారు. చట్టాల గురించి వివరిస్తూ నేరాలు చేసి జైలుకురావడం కరెక్ట్‌కాదని, సమాజంలో మంచివ్యక్తులుగా మారాలని సూచనలు ఇచ్చారు. ఆయన వెంట న్యాయవాదులు డేవిడ్‌రాజు, సోషల్ వర్కర్లు ఎమ్డీ అక్బర్‌అలీ, ఏసుపాదం, జైలు సూపరింటెండెంట్ గోలివెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


మాట్లాడుతున్న ఎంఈవో బుధవ్యాస్

పెదవేగి, మార్చి 23: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధిస్తున్నాయని ఎంఈవో సీహెచ్.బుధవ్యాస్ అన్నారు. కొండలరావుపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించారని, విద్యార్థులు మరింత ఉన్నతంగా ఎదగాలని ఆయన సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల హెచ్‌ఎం వీఎం.కిరణ్మయి, ఉపాధ్యాయులు బి.ప్రమీల, టి.శ్రీను పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల జీవిత చరిత్ర నాటకం

ఏలూరు కల్చరల్, మార్చి 23: తెలుగు సినీ నేపథ్య గాయకుడు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావుపై హైదరాబాద్ సాయి సంతోషి సురభి నాట్యమండలి ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో సురభి సెట్టింగ్‌లతో రమణీయంగా నాటకాన్ని ప్రదర్శించారు. సుమారు 40మంది సురభి కళాకారులు నాటకం రక్తి కట్టించారు. రచన, దర్శకత్వం భాస్కరుని జగదీష్ పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో ప్రేక్షకులు హాజరై నాటకాన్ని ఆద్యంతం వీక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, కేవీవీ.రమేష్, ప్రధాన కార్యదర్శి కేవీ.సత్యనారాయణ, మజ్జి సూర్యకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


కనక దుర్గమ్మ, అన్నపూర్ణ

బుట్టాయగూడెం, మార్చి 23: రెడ్డి గణపవరం కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భౌమరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ నెల 25 హోలీ పౌర్ణమి రోజు నుంచి 5 రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. రెడ్డిరాజుల కాలం నుంచి పూజలందుకుంటున్న అమ్మవారిపై ఏజెన్సీ వాసులకు ఎంతో నమ్మకం. సంతాన లక్ష్మిగా అమ్మవారిని మహిళలు ఆరాధిస్తారు. ఉత్సవాల ఐదు రోజులు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

వైభవంగా జనార్దనస్వామి దివ్య కల్యాణం


కల్యాణ అలంకరణలో తాయార్లు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 23: అగ్రహారంలోని జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జనార్దనస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ కొడవంటిగంటి వెంకటరాజన్, అర్చకులు వంగల పవనకుమార్, వెంకటాచార్యులు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆదివారం నగరంలో రథోత్సవం జరుగుతుందని ఈవో పెద్దింట్లరావు తెలియజేశారు.

సాయి మందిర్ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 23: ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమ మందిర్ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం గణపతిపూజ, అఖండ దీపారాధన, గోపూజ, నవగ్రహ మండపారాధన చేశారు. భక్తులు అష్టోత్తర శత కలశాలు, మేళతాళాలతో నదీ పుష్కరిణి జలాలతో, సుగంధ ద్రవ్యాలతో ఊరేగింపు అనంతరం బాబా వారికి, శిఖరానికి గజ పతాకావిష్కరణ చేశారు. బాబాకు నాలుగు హారతులు ఇచ్చి ఆరాధించారు.

పారిజాతగిరిపై భక్తుల రద్దీ

జంగారెడ్డిగూడెం, మార్చి 23: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ తీర్థప్రసాద గోష్ఠి అనంతరం భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. దాతలు సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిపించారు.

సినీ హీరో రామ్‌చరణ్ అభిమానుల పూజలు

జంగారెడ్డిగూడెం, మార్చి 23: సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఇందిరా నగర్‌లో అభయాంజనేయస్వామికి అభిమానులు శనివారం పూజలు జరిపించారు. రామ్‌చరణ్ యువశక్తి ప్రోత్సాహంతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేసినట్టు చిరంజీవి యువత జిల్లా ఉపాధ్యక్షుడు వలవల తాతాజీ, పేరాబత్తుల దుర్గాప్రసాద్, షేక్ మస్తాన్ తెలిపారు. పీసుపాటి రామలక్ష్మి, కనుపర్తి లక్ష్మీనరసింహ ధనకుమార్, కోపల్లి శ్రీనివాస్, వరికూటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చేవారికే మద్దతు

లింగపాలెం, మార్చి 23: దళితసేన అనుబంధ సంఘమైన మహిళా చైతన్యసేన జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని అన్నారు. అనంతరం రవిప్రకాష్ మహిళా చైతన్యసేన ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సమావేశంలో మహిళా చైతన్యసేన నూతన అధ్యక్షురాలిగా నందిపాం శ్యామల, గౌరవఅధ్యక్షురాలిగా పొదుల నక్షత్రం, బొబ్బూరి కవిత, పొదిల నాగలక్ష్మిలను నియమించారు. సమావేశంలో మహిళా చైతన్యసేన రాష్ట్రకార్యదర్శి బేతాళ జయసుధ, పింగుల ఇదియ, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ అభిమతం


హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ నేతలు

లింగపాలెం, మార్చి 23: ఏలూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిగా పుట్టా మహేష్ యాదవ్‌ను ఎంపిక చేయడంపై టీడీపీ బీసీ సెల్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు తాళం సోంబాబు, ప్రధాన కార్యదర్శి చెన్ను శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని, ఏలూరు పార్లమెంట్‌లో బీసీని అభ్యర్థిగా ప్రకటించినందుకు సంతోషంగా ఉందన్నారు. బీసీలందరూ ఐక్యంగా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, నాయుడు మహేష్, పామర్తి వెంకటేశ్వరరావు, గజ్జా వెంకటేశ్వరరావు, పలగాని సుబ్బారావు, అసిలేటి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని కలసిన యాదవ సంఘ నేతలు


మహేష్‌యాదవ్‌ను కలిసిన సంఘ నేతలు

ద్వారకాతిరుమల, మార్చి 23: టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను జిల్లా యాదవ సంఘం నేతలు విజయవాడలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్కరించి చిన వెంకన్న ప్రసాదాన్ని అందించారు. ఏలూరు పార్లమెంట్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకునేలా స్వామి వారి ఆశీర్వాదం కలగాలని కోరారు. చినవెంకన్నను దర్శించుకుని ద్వారకా తిరుమల నుంచి ప్రచారం ప్రారంభిస్తానని చెప్పారని నేతలు వివరించారు. ఆయనను కలసిన వారిలో కూరాకుల బుజ్జి యాదవ్, ముమ్మిడి చింతయ్య, కాత్రుబాలు, మాగంటి మురళీ కృష్ణ తదితరులున్నారు.

కూటమి అభ్యర్థి బడేటి చంటిని గెలిపించాలి


ప్రజా సంకల్పయాత్రలో జాలా బాలాజి

ఏలూరు టూటౌన్, మార్చి 23: ఏలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బడేటి చంటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ అన్నారు. మూడో డివిజన్‌లో శనివారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సూపర్ 6 పథకాలను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం మాదకద్రవ్యాలతో ముంచేస్తుందన్నారు. ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పోలవరం సీటు జనసేనకు కేటాయించడంపై హర్షం

జీలుగుమిల్లి / పోలవరం, మార్చి 23 : టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా పోలవరం అసెంబ్లీ టికెట్ జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజుకు కేటాయించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో యువకుడిని అభ్యర్థిగా అధినేత పవన్‌కల్యాణ్ ఎంపిక చేయడంపై కరాటం రాంబాబు, కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, కోలా మధు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూలు వెలువడినా అభ్యర్థిత్వంపై ఉత్కంఠకు తెరదించుతూ జనసేనకు కేటాయించారు. టీడీపీ శ్రేణులకు ఆశాభంగమైంది. ఏడు మండలాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎలాంటి హడావుడి చేయలేదు.

గారపాటి చౌదరికి ఎంపీ టిక్కెట్ కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ పటేల్

భీమడోలు, మార్చి 23 : బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసి జిల్లాలో పార్టీకి అండగా నిలిచిన గారపాటి సీతారామాంజనేయ చౌదరికి ఏలూరు ఎంపీ సీటు కేటాయించాలని బీజేపీ శ్రేణులు కోరారు. భీమడోలులోని బీజేపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పలువురు నేతలు తపన చౌదరికి ఏలూరు సీటు కేటాయించాలని తీర్మానం చేశారు. బీజేపీ జిల్లా కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌పటేల్ మాట్లాడుతూ 16 ఏళ్లుగా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తూ దేశ రాజకీయాల్లో ఉన్న గారపాటి చౌదరికి సీటు ఇచ్చే వరకు తామంతా అండగా ఉంటామన్నారు. భీమడోలు మండల ప్రధాన కార్యదర్శి కపిరాజు, కృష్ణకుమారి, రమాదేవి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏలూరు పార్లమెంటు సీటును బీజేపీకే కేటాయించాలని మండల కమిటీ తీర్మానించినట్లు అధ్యక్షుడు దొమ్మేటి లక్ష్మీజనార్ధరావు తెలిపారు. బుట్టాయగూడెంలో శనివారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు సీటును బీజేపీకే ఇస్తారని భావించామని, పొత్తులో భాగంగా టీడీపీకి ఇచ్చారన్నారు. పార్టీకి కోసం అహర్నిశలు పనిచేసిన గారపాటి చౌదరికి ఇవ్వాలని, బీజేపీ గెలిస్తేనే ఏజెన్సీలో సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వంకా కాంచనమాల, కె.రామకృష్ణ, డీఎస్ఆర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

ఉంగుటూరు, మార్చి 23: నాచుగుంట శివారు కొత్తగూడెం వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరినట్లు పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. దసరి విజయ్, మెడవంకల సీమరాజు, గంటా సుభాష్ ఆధ్వర్యంలో పలువురు శనివారం జనసేనలో చేరారు. పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ జనసేన కూటమి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూ టౌన్ :** ప్రేమ, సేవ పరస్పర సహకారంతో శాంతియుతంగా జీవించాలని రెవరెండ్ పాదర్ బాల అన్నారు. సెంట్ జాన్స్ బీఈడీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ బొల్లాయిగూడెంలో మన్నా చర్చ్ కూల్చివేతపై వస్తున్న కథనాల్లో వాస్తవం లేదన్నారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. ఫాదర్ మైకేల్, పాస్టర్లు అబ్రహం, బీవీ రాజు, శ్యామ్‌బాబు, సుదర్శనబాబు, తిమోతి పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** తంగెళ్ళమూడిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఈనెల 27న పాంచాహ్నిక పునః ప్రతిష్టా కార్యక్రమం, రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ప్రతిష్ఠ సందర్భంగా శనివారం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు.
- నగరంలోని శివాలయాల ప్రాంగణాల్లో శనీశ్వరస్వామికి భక్తులు సామూహికంగా తైలాభిషేకాలు నిర్వహించారు. దోష నివారణ పూజలు చేసి ఉపవాస దీక్షలు నిర్వహించారు. మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, ప్రతాప విశ్వేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, రేపులింగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామిఆలయ ప్రాంగణాల్లో పూజలతో చేశారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లి మందా సమేత శనీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి నువ్వుల నూనెతో అభిషేకాలు నిర్వహించి దోష నివారణ పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. జంగారెడ్డిగూడెం సాయి భక్తిరంజని కళాకారులు భక్తి సంకీర్తనలను ఆలపించారు.
- **ఉంగుటూరు :** భవిత పాఠశాలలో 20 మంది విద్యార్థులు అభ్యాసం చేస్తున్నారు. కొంత మంది రాలేని పరిస్థితుల్లో వారికి విమల, రాజు శిక్షణ ఇస్తున్నారు. శనివారం అధికారులు శనివారం భవిత కేంద్రం పరిశీలించారు. వెల్లమిల్లిలో మానేపల్లి శ్రీను కుమారుడు వెంకట్రావుకు శిక్షణను ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు పరిశీలించారు.

బహిరంగ ప్రకటన

ALLAMRAJU PAVAN KUMAR S/o SUBBA RAO ... AKONDI ACHYUTHA VALLI KRISHNAVENI W/o ALLAMRAJU PAVAN KUMAR ...

షెడ్యూల్

... RS NO. 1167-1 ...

పి.వేణుగోపాల రావు, అడ్వకేట్ ... 9346960767


బుట్టాయగూడెంలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఏలూరులో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ



పోలవరంలో భగత్‌సింగ్ వర్ధంతి సభలో నాయకులు


టి.నరసాపురంలో అరసం ప్రతినిధుల నివాళి

దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా

యువత పోరాడాలి

భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల పిలుపు

బుట్టాయగూడెం, మార్చి 23: దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా యువత పోరాడాలని పీవైఎల్ నాయకులు కె.పోతురెడ్డి, టి.బాబురావు, పీడీఎస్‌యూ నాయకుడు బి.వినోద్ పిలుపు నిచ్చారు. పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దొరమామిడి, బుట్టాయగూడెంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ సమాజంలో అసమానతలులేని వ్యవస్థ ఉండాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని విమర్శించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజలపై తీవ్రమైన దాడులు చేస్తున్నారన్నారు. పూనెం రాముడు, మామిడి మురళి, కరకాల ప్రతాప్, జి.బాబురావు, గోగుల చిన్నారెడ్డి, పండు, వి.సాయి, ఎం.మంగరాజు, కె.రామ్, జి.శ్యామ్, ఎం.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాషణం మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పొగ బాంబుల వర్షాన్ని కురిపించి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేశారని నివాళులర్పించారు. వారి త్యాగానికి భిన్నంగా ఇప్పటి పాలకులు దేశ సంపదను అదాని, అంబానిలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు భర్తీచేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నాని మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థుల సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థులు విప్లవ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. క్రాంతి, రేవంత్, యశ్వంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు బాటలో పయనించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కేవీ.రమణ, బద్దా వెంకట్రావు అన్నారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో దోపిడీకి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన విప్లవయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అన్నారు. చేపలతూము సెంటర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. యర్రా శ్రీనివాసరావు, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్‌వీఆర్‌కే జూనియర్ కాలేజీలో బహుమతుల ప్రదానం చేశారు. సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి నగర కార్యదర్శి కిషోర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. రాజ్‌గురు, సుఖదేవ్, భగత్‌సింగ్ త్యాగాలను గుర్తు చేశారు. రామకృష్ణ, ఆదిశేషు, శ్యామలరాణి, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో బండి వెంకటేశ్వరరావు, భజంత్రి శ్రీనివాస్, చింతల సూర్యనారాయణ, రెడ్డి నాగేశ్వరరావు, గేదెల నాగేశ్వరరావు, తదితరులు నివాళులర్పించారు.

● వేలేరుపాడు: భగత్ సింగ్ వర్ధంతి సీపీఐ కార్యాలయంలో గంగరాజు అధ్యక్షతన జరిగింది. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు యర్రా మధు, బంధం నాగేశ్వరరావు మాట్లాడారు. యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజంలో అసమానతలు, దోపిడీపై పోరాటాల్లో ముందుండాలన్నారు. సన్నేపల్లి సాయిబాబు, బాడిస రాము, పిట్టా వీరయ్య, దుర్గారావు, భీమరాజు, లెనిన్, పాపారావు, అరుణ్; ముత్యాలరావు, రాము, జయమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు ఎస్ మోహన్, ఎస్‌కె భాషా అన్నారు. రెడ్డినాగంపాలెంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో చెదల శివ, కుంజం రామారావు, మోహన్ తదితరులు మాట్లాడుతూ అందరికీ విద్య వైద్యం, ఉపాధి హక్కుకై పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌ఈపి 2020 సామాన్యులకు విద్యను దూరం చేసే పరిస్థితులు తెచ్చాయన్నారు. పాఠశాలల విలీనం వలన గిరిజన ప్రాంత విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సవలం రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: భగత్‌సింగ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బిఎస్ సాగర్ అన్నారు. అరసం అధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాగర్ మాట్లాడుతూ భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న నేటి మనువాద పాలకులకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటం నిర్వహించాలన్నారు. పి.పాండురంగారావు, కవి నిమ్మగడ్డ అశోక్ బాబు, వైద్యుడు కె.సురేంద్రబాబు, పురం శ్రీనివాస్, కంచర్ల పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: సీతారామనగరం, కుక్కునూరు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ ఆశయాలకు విరుద్ధంగా నేడు పాలన సాగుతోందని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి ఆరోపించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్యాన్ని, మత సామరస్యాన్ని కాపాడే పార్టీలకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలన్నార. సీపీఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, మేడిపల్లి రమణయ్య, గంగాధర శ్రీనివాస్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరులో ఆక్రమణల పర్వం

కోమటిలంకలో 40 ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకం

ఏలూరు రూరల్, మార్చి 23 : కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. వందల ఎకరాలను చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. అభయారణ్యంలో ఐదో కాంటూరు పరిధిలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా వాటిని బుట్టదాఖలు చేసి అధికార పార్టీ నాయకులే తవ్వకాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో సుమారు 40 ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులను తవ్వుతున్నారు. ఇందులో 15 ఎకరాలు అభయారణ్యం పరిధిలో ఉంది. అధికార పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి అక్రమంగా చేపల చెరువులు తవ్విస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు అభయారణ్యంలోకి యంత్రాలు ప్రవేశించడం చట్టరీత్యా నేరం. యంత్రాలను తీసుకెళ్లాలంటే తప్పని సరిగా అనుమతి తీసుకోవాలి. కొల్లేరు ప్రాంతానికి కూతవేటు దూరంలోనే చెక్‌పోస్టులు ఉన్నా.. అధికారులకు తెలిసినా.. యథేచ్ఛగా చెరువు తవ్వకాలు జరగడం గమనార్హం. పంట కాల్వల పూడికతీతకు అనుమతి కోరితే నిరాకరించే అధికారులు అక్రమ చెరువులకు అనుమతులు ఎలా ఇస్తున్నారని కొల్లేరు వాసులు మండిపడుతున్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- కండీషన్ లేని సిటీ బస్సులేమిటని భక్తుల ఆగ్రహం


పేలిన బస్సు టైరు

ద్వారకాతిరుమల, మార్చి 23: కండీషన్‌లో లేని ఆర్టీసీ బస్సులను రహదా రులపై పంపి సంస్థ అధికారులు ప్రయాణికుల ప్రాణాలతో ఆడుకుంటు న్నారనడానికి ఈఘటనే నిదర్శనం. శనివారం ఉదయం ద్వారకాతిరుమల నుంచి విజయవాడకు ప్రయాణికులతో బయలుదేరిన గవర్నర్‌పేట డిపో బస్సు సత్యన్నారాయణపురం వద్ద హైవేపై ముందు టైరు పేలి పెద్ద శబ్దం వచ్చింది. బస్సు మెలికలు తిరుగుతూ వెళ్తుండడంతో ప్రయాణికులు భీతిల్లి కేకలు వేశారు. డ్రైవర్ చాకచక్యంతో బస్సును మార్జిన్ పక్కన సురక్షితంగా నిలిపివేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమయంలో వెనుక వాహనాలు రాకపోవ డంతో పెనుప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి ద్వారకాతిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులు చాలా వరకు విజయవాడ సిటీలో తిరిగే బస్సులను వినియోగిస్తు న్నారు. ఇవి కండీషన్‌లో ఉండడం లేదని, సీట్లు కూడా దూరప్రయాణాలకు ఉపయోగపడకుండా, లగేజీ ఉంచుకునేందుకు అవకాశం లేదని యాత్రికులు చెబుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండి అధిక ఆదాయం వచ్చే ద్వారకాతిరుమల క్షేత్రానికి సిటీ బస్సులను పంపడమేమిటని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ద్వారకాతిరుమలకు సిటీబస్సులు కాకుండా కండీష న్‌లో ఉండే సాధారణ బస్సులను పంపాలని పలువురు కోరుతున్నారు.



దాతలకు సత్కారం

నూజివీడు టౌన్, మార్చి 23: నూజి వీడు మండలం పోతు రెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలకు ప్రింటర్, పోర్టబుల్ స్పీకర్‌ను గ్రామానికి చెందిన సంజా అంబేద్కర్, ఎన్‌వీ ప్రసాద్ వితరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.జయమణి, సీనియర్ ఉపాధ్యాయులు బాబూరావు తదితరులు దాతలను ఘనంగా సత్కరించారు.

ఆధ్యాత్మికం


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

లక్ష్మీనృసింహస్వామి వారికి గరుడోత్సవం

కైకలూరు, మార్చి 23: వరహాపట్నం లక్ష్మీ నృసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా స్వామివారి గరుడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఇంటింటా భక్తులు హారతులు పట్టి పూజలు చేశారు. సాయంత్రం కల్పవృక్ష, వాహనసేవ, పూజా కార్యక్రమాలను అర్చకులు బృందావనం ధన్వంతరీ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ దంపతులు పాల్గొని పూజలు చేశారు.

నేడు పెద్దింటమ్మ తెప్పోత్సవానికి ఏర్పాట్లు..

కైకలూరు, మార్చి 23: పెద్దింటమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉత్సవాల చివరి రోజు కావడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. సాయంత్రం అమ్మవారి కోనేరులో తెప్పోత్సవం కార్యక్రమానికి ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ముదినేపల్లి, మార్చి 23 : పెదగొన్నూరు శివారు విశ్వనాద్రి పాలెంలో రామాలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయం వద్ద యాజ్ఞీకుడు రాంపల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వీరంకి చక్రపాణి, పరసా సత్యనారాయణ, పరసా యేసు దంపతులు పూజలు జరిపారు. విగ్రహ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలకు ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

వైభవంగా భోగేశ్వరస్వామి 16 రోజుల పండుగ



కలిదిండి, మార్చి 23 : కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఈవో శింగనపల్లి శ్రీనివాస రావు, ఛైర్మన్ గంగాధర శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనరసింహుడి కల్యాణం




ముదినేపల్లి రూరల్, మార్చి 23: సింగరాయపాలెంలోని లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామి వారి దివ్యకల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి ఊరేగింపులో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

అత్యవసరమైతే.. ఎలా?

కలిదిండి బస్టాండ్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు

డోర్లు ఊడి.. సామగ్రి విరిగి దుర్వాసనతో ప్రయాణికుల పాట్లు


టాయిలెట్ డోర్ ఊడి.. సామగ్రి విరిగిపోయిన దృశ్యాలు

కలిదిండి, మార్చి 23 : కలిదిండి బస్టాండ్‌లో మరుగుదొడ్లు ప్రయాణికులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. మహిళల టాయిలెట్స్ తలుపులు విరిగి ఓపెన్‌గా ఉన్నాయి. దీంతో మహిళలు టాయిలెట్స్‌కి వెళ్లటానికి కుదరడం లేదు. పురుషుల టాయిలెట్స్ సామగ్రి విరిగిపోయాయి. దీంతో వారు మరుగుదొడ్లను వినియోగించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే దుర్వాసనతో టాయిలెట్లు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కలిదిండి బస్టాండ్‌లో టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో టాయిలెట్స్‌కి డోర్లు అమర్చి, సామగ్రిని బాగుచేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నూజివీడులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం.. చాట్రాయి మండలం పోలవరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

భగత్‌సింగ్ వర్ధంతి సభలో వక్తల సూచన

నూజివీడు, మార్చి 23: ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న మతతత్వ పార్టీలను సార్వత్రిక ఎన్నికల్లో ఓడించటమే విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నిజమైన నివాళి అని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు అన్నారు. నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఉరితాడు ముద్దాడిన విప్లవవీరుడు భగత్‌సింగ్ చరిత్రను నేటి యువత అధ్యయనం చేయాలన్నారు. ముఠా యూనియన్ నాయకులు చంద్రరావు, కృష్ణ, అప్పలనాయుడు, సత్తిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ దేశభక్తి అనుసరణీయం..

చాట్రాయి, మార్చి 23: భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందడుగు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ అన్నారు. మండలంలోని పోలవరం సెంటర్‌లో, జడ్పీ హైస్కూల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ ప్రాణాలర్పించారని ఆయన దేశభక్తిని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. కుల వివక్షత భగత్‌సింగ్ తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమ్ము ఆనందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి, మార్చి 23: ఎన్నికల నియమావళి అమలులో పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ, ఎంపీడీవో మంగాకుమారి, ఎస్సై కేసీహెచ్ స్వామి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన బీఎల్వోల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేకుండా జరిగే రాజకీయ కార్యకలాపాలపై వెంటనే మండల స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు, సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం చేయాలన్నా అనుమతులు తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లటం, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ నాయకులకు పనులు ఉంటే ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి చేయించుకోవాలని వారి వద్దకు వెళ్ళకూడదన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు, అన్ని గ్రామాల బీఎల్వోలు పాల్గొన్నారు.

నాయకులు సహకరించాలి : ఎంపీడీవో


బలివేలో పర్యటిస్తున్న ఎంపీడీవో పద్మావతీదేవి

ముసునూరు, మార్చి 23: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఎంపీడీవో సీహెచ్.పద్మావతీదేవి అన్నారు. శనివారం బలివే, యల్లాపురం, చిల్లబోయినపల్లి తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు జరుగుతోందో లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, సభలు, మైక్‌లు తదితర వాటికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో మహేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శనలో ఒక సన్నివేశం

ఆకట్టుకుంటున్న శ్రీకృష్ణ రాయబారం

కైకలూరు, మార్చి 23: పెద్దింటమ్మవారి జాతర మహోత్సవాల్లో శనివారం అమ్మవారికి అష్టాదశపీఠ పూజ, అష్టాదశ కలశార్చన, వ్రతసాధన హోమం, బలిహరణ, దూపసేవ, బాలభోగం, హారతి, పంచహారతులు, మంత్రపుష్పం తదితర పూజలను ఆలయ అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, భక్తులకు ప్రసాదాన్ని కైకలూరుకు చెందిన బండారు అనిల్‌కుమార్ దంపతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాత్రి పెరికేగూడెం శ్యామలాంబ కళానికేతన్ శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.


వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కైకలూరు, మార్చి 23: కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామంలోని యూపీ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్పంచ్ నున్న రాంబాబు బహుమతులు అందజేసి మాట్లాడుతూ ఉన్నత విద్య నభ్యసించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం చిట్టూరి చంద్రశేఖర్, స్కూల్ ఛైర్మన్ బోడావుల బాల ఏసు, గ్రామస్థులు తేరా రమేష్, ఎం. నాగమల్లేశ్వరరావు, బోయిన గోవర్ధన, అడవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చాట్రాయిలో టెన్త్ పరీక్షలకు వస్తున్న విద్యార్థులు


ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- శనివారం ముగిసిన ఫిజికల్ సైన్స్ పరీక్ష
- పరీక్షా కేంద్రాల వద్ద నిశితంగా తనిఖీలు
- పటిష్ఠ పోలీసు బందోబస్తు

నూజివీడు టౌన్, మార్చి 23: 10వ తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం సైన్స్ పరీక్షకు 317 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నూజివీడు డివిజన్ పరిధిలోని నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల పరిధిలో మొత్తం 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 3,892మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. శనివారం మొత్తం 3,575 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 317మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు.

ఆగిరిపల్లి: టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్షకు ఆగిరిపల్లి మండలంలో 720 మందికి 69 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో తెలిపారు. జడ్పీ హైస్కూల్లో 259 మందికి 240మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో 207 విద్యార్థులకు 187 మంది, ఎస్.వి పబ్లిక్‌స్కూల్లో 257 విద్యార్థులకు 227 మంది హాజరు అయినట్లు తెలిపారు. 26వ తేదీ వరకు పరీక్షలు లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు వీలు చిక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాట్రాయి: చాట్రాయిలో శనివారం జరిగిన టెన్త్ పరీక్షలకు 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 244 మందికి గాను 217 మంది, ఆర్సీఎం పరీక్షా కేంద్రంలో 179 మందికి గాను 158 మంది హాజరయ్యారని ఎంఈవో వివరించారు.

ముసునూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాం తంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముసునూరులో 226 మందికి 215 మంది, గోపవరంలో 189 మందికి 170 మంది, చెక్కపల్లి జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 290 మంది విద్యార్థులకు గాను 259 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ జవహర్ బాజీ, ఎంపీడీవో సీహెచ్.పద్మావతీదేవి తనిఖీ చేశారు. ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముదినేపల్లి: పదవ తరగతి పరీక్షలకు శనివారం ముదినేపల్లి మండలంలో 102 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్షను 823 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 721 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, సహాయ మాతా హైస్కూల్‌లో 46 మంది, జడ్పీ హైస్కూల్‌లో నలుగురు, పెదగొన్నూరు హైస్కూల్‌లో రెగ్యులర్ విద్యార్థులు ఐదుగురు, ప్రైవేట్ విద్యార్థులు 40 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

శుక్రవారం కాపీ చేస్తూ విద్యార్థి పట్టుబడిన నేపథ్యంలో శనివారం ముదినేపల్లిలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను పోలీసులు, ఇతర సిబ్బంది నిశితంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల గేట్లు వద్దే విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపారు. పరీక్షాహాలులో ఇన్విజిలేటర్లు కూడా అప్రమత్తమయ్యారు.

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్షకు 1211 మంది విద్యార్థులకు 1093 మంది హాజరు కాగా, 118 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. ఎస్ఐ ప్రియకుమార్ బందోబస్తు నిర్వహించారు.

టీటీడీకి కూరగాయలు పంపిన దాతలు



నూజివీడు టౌన్, మార్చి 23: తిరుమల తిరుపతి దేవస్థానంలోని వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి నూజివీడు మండలం దేవరగుంట రైతులు 12 టన్నుల కూరగాయలను వితరణగా అందించారు. దేవరగుంటకు చెందిన నక్కా హనుమంత రావు ఆధ్వర్యంలో ప్రతి నెలా దేవరగుంటకు చెందిన పలువురు రైతులు టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమానికి, విజయవాడ దుర్గమ్మ, ద్వారకా తిరుమల, శ్రీశైలం ఆలయాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలకు కూరగాయలను వితరణగా అందిస్తున్నారు. ఈ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ప్రత్యేక వాహనంలో 12 టన్నుల కూరగాయలను దేవరగుంట, నూజివీడుకు చెందిన పలువురు దాతల సహకారంతో పంపించినట్లు హనుమంతరావు తెలిపారు. దీంతో పాటు విజయవాడ కనక దుర్గమ్మ ఆలయానికి రెండు టన్నులు, శ్రీశైలం, ద్వారకాతిరుమల ఆలయాలకు మూడున్నర టన్నులు కూరగాయలను రైతులు సహకారంతో పంపినట్లు ఆయన తెలిపారు. పంపిన కూరగాయలలో ఐదు టన్నుల మామిడితో పాటు దోస, వంగ, సొర తదితర కూరగాయలున్నట్టు తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థి రాకిన్ ప్రతిభ



నూజివీడు టౌన్, మార్చి 23: నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన పర్వతనేని రాకిన్ చౌదరి ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విభాగంలో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. 100 మీటర్ల రన్నింగ్ రేస్‌లో ద్వితీయస్థానం సాధించి రజత పతకాన్ని, షాట్‌పుట్‌లో ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకాన్ని సాధించినట్లు నూజివీడు త్రివిధ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తమ విద్యార్థి రాకిన్ చౌదరి ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నాడన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రాకిన్‌ను అభినందించారు.



మహిళల్లో చైతన్యమే విజయానికి నాంది

- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన

ముసునూరు, మార్చి 23: మహిళల్లో చైతన్యం చూస్తుంటే తన గెలుపు ఖాయమనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గుడిపాడులో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ ఏ ఉద్యమానికైనా మహిళా చైతన్యం ప్రధానమని తనకు పార్టీలో అన్యాయం జరిగిందన్న భావనతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండటం చూసి మహిళల్లో చైతన్యం రావడం చూస్తే తన గెలుపు ఖాయమైందన్నారు. యువత ఆధ్వర్యంలో ముద్దరబోయిన జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ముగిసిన నిష్కళంక మాత ఉత్సవాలు

ముసునూరు, మార్చి 23: నెహ్రూనగర్ నిష్కళంకమాత ఉత్సవాలు కృతజ్ఞతా దివ్య బలిపూజతో శనివారం వైభవంగా ముగిశాయి. విజయవాడ పీఠాధిపతులు శ్రీ తెలగతోటి జోసఫ్ రాజారావు సమష్టి దివ్యబలిపూజ నిర్వహించి, భక్తులకు తన సందేశాన్నిచ్చారు. క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడుచుకోవాలని ఆయన ఉద్బోధించారు. అనంతరం ముసునూరు విచారణ సహాయ గురువులు రెవ. ఫాదర్ గాంధీరాజ ఉదయకాల ప్రార్థనలు, దివ్య సత్ప్రసాద ఆరాధన చేశారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా బలపాల విచారణ గురువులు రెవ. ఫాదర్ జాన్‌కిషోర్ నిర్వహించిన కృతజ్ఞతా దివ్యబలిపూజతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల విజయవంతానికి కృషిచేసిన వారికి ఉత్సవ నిర్వాహకులు, ముసునూరు ఆర్‌సీఎం చర్చి గురువు రెవ. ఫాదర్ జోసఫ్ తంబి కృతజ్ఞతలు తెలిపారు. వాక్యోపదేశకులు దేవరపల్లి బెనర్జీ, చీలి బాలస్వామి, నాగభూషణం, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

PONNAM VENKATA LAKSHMANA RAO S/o KRISHNA MURTHY ... YALAMARTHI HEMA HAREESHA W/o YALAMARTHI SRIKANTH ... R.S.No.102/1 ... D.N.6-1 RCC ... 23.03.2024 [illegible]

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ... వెంకట శివాజీ ... షెడ్యూలు-1: కృష్ణాజిల్లా, నూజివీడు ... షెడ్యూలు-2 ... షెడ్యూలు-3 ... DOC NO.S: 3220/2011, 6035/2011, 2781/2011, S.R.O. నూజివీడు. [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada.
Ph : 98494 31432

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 09089

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234